
# చిగురించని వసంతం

ఎమ్. శివరామ్ ప్రసాద్

'బ్రతుకు బుగ్గి చేసిన సారా' కథల పోటీలో ఈ వారం ఎన్నికయిన కథ



**రాత్రి తొమ్మిది గంటలవుతోంది. యన్.హెచ్.5 రహదారి మీద వచ్చేపోయే భారీ వాహనాలు శరవేగంతో దూసుకుపోతున్నాయి. కైలాసగిరి హనుమంతవాక జంక్షన్ వద్ద హైవేపై ఉన్న చందన మోహన ఫంక్షన్ హాల్ రంగు రంగుల విద్యుద్దీపాలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. "సుధ వెడ్స్ శేఖర్" అనే గ్లో సైన్‌బోర్డ్ అక్కడ జరుగుతున్న వివాహ కార్యక్రమాన్ని వేయి కాంతులు వెదజల్లుతూ వెల్లడిస్తోంది.**

ఫంక్షన్ హాల్ ఆవరణలో బారులు తీరిన ఖరీదైన కారులు అక్కడ విచ్చేసిన అతిథుల అంతస్థులకు అద్దం పడుతున్నాయి. లయబద్ధమైన మంద్రస్థాయి మంగళవాద్యాలు పురోహితులు ఉచ్చరిస్తున్న పెళ్ళి మంత్రాలకు నాద స్వరూప నేపథ్యాన్ని కలిగిస్తున్నాయి.

వరుడు చంద్రశేఖర్ అరవింద్ బిల్డర్స్ అధినేత కులపతిగారి రెండవ కుమారుడు, న్యూజెర్సీ, అమెరికాలో ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ సంస్థలో సిస్టమ్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కులపతి గారి పరపతి విశాఖపట్టణం పురప్రముఖులకు, ప్రజలకు పరిచితమే. ఆయన పెద్ద కొడుకు సుధాకర్ కలకత్తాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మానేజ్‌మెంట్‌లో యమ్.బి.ఏ.లో గోల్డ్ మెడలిస్ట్. అక్కడే కళ్యాణి బ్రూవరీస్ లిమిటెడ్‌లో ముచ్చటగా మూడేళ్ళు మార్కెటింగ్ మానేజర్‌గా చేసి ప్రస్తుతం తండ్రి వ్యాపారంలో ఆయనకి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. కులపతి, భాగ్యవతి దంపతులకు సంతానం వీరిద్దరే.

వధువు సుధ ప్రముఖ వ్యాపారవేత్త అరుణ్ ఆటోమోబైల్స్ ప్రొప్రయిటర్ రామరాజుగారి ఏకైక ముద్దుల గారాలపట్టి. ఆంధ్ర యూనివర్సిటీలో ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్ ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయి అరవింద్ బిల్డర్స్‌లో మానేజ్‌మెంట్ ట్రెయినీగా పనిచేస్తోంది. ఆటోమోబైల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా రామరాజుగారి రేటింగ్ కూడా సిటీ వి.ఐ.పి. స్కాన్‌లో కులపతిగారికి ఏమీ తీసిపోదు. వియ్యమందడానికి ఇచ్చి పుచ్చుకోడానికి ఇద్దరూ సరిసమానులే. అనేక స్వచ్ఛంద సేవా సంస్థలతో వారిద్దరికీ సంబంధం వుంది. నగరంలో పలు సాంస్కృతిక సంస్థలకు కూడా వీరి అండదండలున్నాయి. కులపతి, రామరాజుగార్ల చిరకాల స్నేహానికి ఇప్పుడు బంధుత్వమనే ముడి కూడా పడింది.

పూల పల్లకీలా అలంకృతమై అలరారుతున్న కళ్యాణవేదికపై అపర రతీమన్మథుల్లా ఉన్న నూతన వధూవరులు సుధా శేఖరులను ఆశీర్వదిస్తూ వారికి శుభాకాంక్షలతో తాము తెచ్చిన కానుకలను అందజేసి వెనుతిరుగుతున్నారు ఆహ్వానితులు అభ్యాగతులు. బాదం మిల్క్, ఆరెంజ్, లెమెన్, ద్రాక్ష, ఆపిల్ జ్యూస్‌లతో కొంతమంది సేద తీరుతుంటే, మరికొందరు బయట ఆవరణలో బఫే డిన్నర్‌ను ఆస్వాదిస్తున్నారు. వివాహ విందు అనంతరం శెలవు తీసుకు వెళ్ళిపోతున్న అతిథులకు గిఫ్ట్ పాకెట్లు అందిస్తున్నారు చిరునవ్వులు చిందిస్తూ ముద్దబంతి పూలలా కనువిందు చేస్తున్న అందమైన అమ్మాయిలు.

వివాహతంతు ముగిసేసరికి అర్ధరాత్రి అయింది. అతిథులందరూ వెళ్ళిపోయారు. ఇరువైపుల కుటుంబ సభ్యులు కొద్దిపాటి దగ్గర బంధువులు మిగిలారు. హాలు పై అంతస్తులో ఉన్న పది గెస్ట్ రూముల్లో వధూవరులతోసహా అందరూ సర్దుకొని బరువెక్కిన కనురెప్పలతో నిద్రకొరిగారు. మర్నాడు పొద్దున అన్నవరం కొండపై నూతన వధూవరులకు సత్యనారా

యణ వ్రతం కార్యక్రమం ఉంది. కొత్త దంపతులు కారులోను తదితరులు రిజర్వ్డ్ బస్‌లోనూ వేకువనే ప్రయాణించడానికి నిర్ణయించడమైంది. అంతటా నిశ్శబ్దం నెలకొంది.

పై అంతస్తులోని అతిథి గదులలో అన్నిటికన్నా చిన్నది, చివరన ఉన్న దాంట్లో రాత్రి రెండు గంటలైనా లైటు వెలుగుతోంది. గది తలుపు లోపల గడియపెట్టి ఉంది. తెరచిన కిటికీ పై రెక్కలోంచి కాంతి వరండాలోనికి ప్రసరిస్తోంది. కులపతిగారి పెద్దకొడుకు, పెళ్ళికొడుకు చంద్రశేఖర్. అన్నగారైన సుధాకర్ ఒంటరిగా గదిలో మంచం పైన కూర్చుని పక్కనే చిన్న టేబుల్‌పై ఓపెన్‌చేసి ఉన్న విస్కీ బాటిల్ లోంచి లిక్కర్ గ్లాస్‌లోకి ఒంపుకుంటున్నాడు. పెదవుల మధ్య విల్స్ ఫిల్టర్ కింగ్ సిగరెట్ వెలుగుతోంది. కిటికీ గుండా పొగ బైటకి వస్తోంది. అప్పటికే మూడొంతులు బాటిల్ ఖాళీ అయింది. డ్రింక్ పంచ్ చేయడానికి పెట్టుకున్న పెప్సీ బాటిల్స్ నాలుగింట్లో మూడు ఖాళీ అయి నేలమీద పడి ఉన్నాయి. కలకత్తాలోని కళ్యాణీ బ్రూవరీస్‌లో సర్వీస్‌లో ఉన్నప్పుడే మద్యపానానికి సిగరెట్ స్మోకింగ్‌కి అలవాటు పడ్డాడు సుధాకర్. ఎవరెంత చెప్పినా వినకుండా త్రాగుడుని దినదినాభివృద్ధి గావించుకున్నాడు.

ఉద్యోగంలో ఉన్నప్పుడే రెండేళ్ళ కిందట సుధాకర్ పెళ్ళి ఎడ్వకేట్ సుదర్శనశాస్త్రిగారి అమ్మాయి మంజరితో వైభవంగా జరిగింది. ఏడాది కిందటే మొగుడిచేత త్రాగుడు మాన్పించలేక అలిగి ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. రెండు నెలల కిందట భర్త నుండి విడాకులు కోరుతూ డైవర్స్ స్యూట్ ఫైల్ చేసింది ఆమె. పిల్లాజెల్లా లేకపోవడంవల్ల విడాకులకు అవరోధం లేదు. మదిర విందు మగువ పొందు లేకుండా చేసింది సుధాకర్‌కు. మద్యం సేవించడం, సిగరెట్ పొగ పీల్చడం తప్ప మరే చెడ్డ అలవాటు లేదు సుధాకర్‌కి. ఇవి సాధారణంగా మొగవాళ్ళు చాలామందికి ఉన్న సాధారణమైన అలవాట్లే. అంతమాత్రం చేత పెళ్ళి అయిన స్త్రీలంతా త్రాగుడుకు అలవాటుపడ్డ తమ భర్తల నుండి విడాకులు కోరి ఉంటే వివాహ వ్యవస్థ నిలిచి ఉండేదా? ఎంతమంది స్త్రీలు తమ భర్తలతో సర్దుకుపోవడం లేదు. తన బ్రతుకు బుగ్గిచేసింది సారాకాదు, తన భార్య మంజరేనని సుధాకర్ గట్టి నమ్మకం. తన అలవాట్లను మానుకొని భార్యావిధేయుడుగా జీవచ్ఛవంలా తను బ్రతకలేడు. అందుకే ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు విడిపోవడమే తామిద్దరికీ శ్రేయస్కరం అన్న సిద్ధాంతానికి తావిచ్చాడు సుధాకర్. తన బ్రతుకులో విషాదాన్ని కప్పిపుచ్చడానికన్నట్టు ఖాళీ అయిన బాటిల్ పక్కకు నెట్టి కొత్త విస్కీ బాటిల్ ఓపెన్ చేశాడు అతడు. గొంతులో విస్కీ చల్లగా దిగుతూంటే అతని మనసు ఏవో తెలియని లోకాల్లో విహరిస్తోంది దూదిపింజలా.

భళ్ళున తెల్లవారింది. తెరచిన కిటికీల లోంచి బాలభానుని లేతకిరణాలు సుతారంగా తట్టి లేపుతూంటే ఉలిక్కిపడి నిద్ర లేచారు అందరూ. గబగబా కాలకృత్యాలు ముగించుకుని సామాన్లు మినీ బస్‌లోనూ కార్ డిక్కీలోనూ సర్దుకొని అన్నవరం వైపుబయలుదేరారు పెళ్ళివారు. ముందున్న కారు డ్రైవర్ సీట్లో సుధాకర్ కూర్చున్నాడు. వెనుక సీట్లో కొత్త దంపతులు సుధ శేఖర్‌లు ఒకరి కళ్ళలోకి మరొకళ్ళు మత్తుగా చూసుకుంటూ కనులు తెరుచుకునే ఏవో మధురమైన ఊహల్లో తెలిపోసాగారు. బంగారు భవిష్యత్ వాళ్ళ ముందర రెక్కలు విప్పుకొని నాట్యమాడుతోంది. మినీ బస్‌లో వెనుక వస్తున్న వాళ్ళ తల్లిదండ్రులు రామరాజు రాజ్యలక్ష్మిగార్లు. కులపతి భాగ్యవతిగార్లు ఇతర ఆత్మబంధువులు ఆప్తమిత్రులు ఉన్నారు. అన్నవరం కొండపైన కొలువైన సత్యనారాయణ స్వామిని దర్శించి. వ్రతమాచరించి. కొత్తకాపురానికి స్వామివారి ఆశీస్సులు తీసుకొని తిరిగి మధ్యాహ్నం విశాఖపట్టణం విమానాశ్రయం చేరుకుని చెన్నై ఫ్లైట్‌లో వెళ్ళాలి కొత్త దంపతులు. తరువాత తిరుపతి వెళ్ళి వేంకటేశ్వరస్వామికి కల్యాణం చేయించి. మరుసటి రోజు రాత్రి చెన్నై నుండి నేరుగా అమెరికాకు ప్రయాణం. చంద్రశేఖర్‌కు శెలవు ఎక్కువ లేకపోవడంతో వెంటవెంటనే ప్రయాణ ఏర్పాట్లు చేయవలసి వచ్చింది.

రాత్రంతా మద్యపానం చేసిన సుధాకర్‌కు కళ్ళు మసకేసిపోయి స్టీరింగ్ వీల్ మీద సరైన కంట్రోల్ లేదు. అతనున్న శారీరక మానసిక స్థితిలో కార్ డ్రైవింగ్ దుస్సాహసమనే చెప్పుకోవాలి. నేషనల్ హైవేస్ వెడల్పు చేసే ప్రక్రియలో రోడ్డంతా డైవర్షన్స్‌తో అస్తవ్యస్తంగా ఉంది ఎగుడు దిగుడులతో. మద్యం మత్తులో డ్రైవ్ చేస్తున్న సుధాకర్‌కు ఎదురుగా వస్తున్న గడ్డిమోపులతో కప్పబడిన ట్రాక్టర్ కదిలి వస్తున్న కొండలా కనబడింది. దానిని తప్పించుకుందామని సడన్‌గా స్టీరింగ్ వీల్ పక్కకు తిప్పాడు. కంట్రోలు తప్పిన కారు ఆరు అడుగుల ఎత్తునుంచి పక్కనున్న పొలాల్లోకి బోర్లా పడింది. జరిగిందేమిటో తెలుసుకునే లోగానే కారులో ప్రయాణిస్తున్నవారి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. చిగురించే నూతన దాంపత్యానికి చరమగీతం పాడింది మద్యం మహాత్యం. ❋

**ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది.**

**- ఎడిటర్**

## వి'చిత్ర' వ్యాఖ్య పోటీ ఫలితం - 16

మేము ప్రారంభించిన వి'చిత్ర' వ్యాఖ్య పోటీలో మా ఊహకు మించి పాఠకులు పాల్గొని వ్యాఖ్యలు పంపారు. అందరికీ మా అభినందనలు. మాకు వచ్చిన (5-05-2004 సంచిక) వ్యాఖ్యలలో ఈ క్రింది వ్యాఖ్యను ఉత్తమంగా ఎన్నిక చేయడమైనది.



*"ఈ ఎన్నికలన్నీ వింత పొంతనలె గురూగురూ*
*ఈ కలికాలం వింతల జాలం, శిష్యా శిష్యా"*

**పంపినవారు**

**ఎ. ఎస్. రామారావు, హైదరాబాద్**

వీరికి ప్రియదత్త వారపత్రిక మూడు మాసాల పాటు అందజేస్తాము. - ఎడిటర్